ప్రశాంతం దిగ్విజయం

● ముగిసిన బ్రహ్మోత్సవాలు

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా ముగియడంతో టీటీడీ పాలకమండలి, అధికార యంత్రాంగం ఆనందంగా ఉన్నాయి. విజయవంతం చేశారంటూ ఏకంగా సీఎం చంద్రబాబు ట్వీట్ చేయడం విశేషం. ఈ విజయం వెనుక మూడు నెలల ముందస్తు కృషి ఉంది. బ్రహ్మోత్సవాల ముందు బదిలీ అయిన ఈవో శ్యామలరావు, తండ్రి కన్నుమూయడంతో హాజరుకాలేకపోయిన అదనపు ఈవో వెంకయ్యచౌదరి ల పాత్ర చాలా ఉంది. ప్రస్తు ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ కు అయిదు బ్రహ్మోత్సవాలను నిర్వహించిన అనుభం ఉండడం, ముఖ్య అధికారులందరికీ గత బ్రహ్మోత్సవాల నిర్వహణలో భాగం అయిన అనుభవం ఉండడం ఈసారి చిన్న అవాంతరం కూడా లేకుండా విజయవంతం కావడానికి కారణమయ్యాయి. ముఖ్యంగా ఈసారి రాజకీయ హడావుడి లేకపోవడం ప్రత్యేకం. ఆ శ్రీనివాసుడే వెనుక ఉండి నడిపించాడని అందరూ ఆనందంగా ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



◆ తోపులాటల్లేని గరుడోత్సవం

బ్రహ్మోత్సవాల్లో పాలకమండలీ, అధికారులూ అత్యంత టెన్షన్‌గా ఉండేది గరుడోత్సవం రోజు. లక్షల మంది జనం ముందే కొండమీదకు చేరుకుంటారు. వీరిలో స్థానికుల సంఖ్య గణనీయంగా ఉంటుంది. వీరికి నీరు, ఆహారం, మరుగుదొడ్ల సౌకర్యం వంటివి లోటు లేకుండా కల్పించాలి. గ్యాలరీల్లోకి ప్రవేశించే సమయంలో తోపులాటలకు అవకాశం ఉంటుంది.

2024లో ముందస్తు ప్రణాళికతో తోపులాటరహిత గరుడోత్సవం రాఘవేంద్రస్వామి మఠానికి సమీపంలో ఏర్పాటు చేసిన అదనపు క్యూలైన్ల ప్రవేశంలో తీవ్రస్థాయిలో తోపులాటలు, తొక్కిసలాటలు చోటుచేసుకున్నాయి. ఈ ఏడాది టీటీడీ పక్కా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించింది. గ్యాలరీల్లో 2 లక్షల మంది, అదనపు క్యూలైన్లు, రీఫిల్లింగ్ ద్వారా మరో 40 వేల నుంచి 45 వేల మందికి మాత్రమే అవకాశం ఉంటుంది. శ్రీవారి మూలవిరాట్టు దర్శనానికి మరో 50 వేల మందికి అవకాశం ఉంటుంది. ఇలా 3 లక్షల మందికంటే తిరుమలకు అధికంగా వస్తే ఇబ్బందులు తలెత్తుతాయని అంచనా వేశారు. 28న జరిగిన గరుడవాహనానికి క్రౌడ్ మెనేజ్మెంట్ సిస్టమ్‌ను అమలుచేసి సక్సెస్ అయ్యారు. తిరుమలకు దాదాపు 3 లక్షల మంది భక్తులు చేరిపోయారని నిర్ధారించుకున్న తర్వాత ఆరోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆర్టీసీ బస్సులు మినహా మరే ఇతర వాహనం తిరుమలకు రాకుండా చర్యలు తీసుకున్నారు. కార్లను అలిపిరి వద్దే ఆపేసి, బస్సులు ఏర్పాటు చేశారు. బస్సుల సంఖ్యను కూడా తగ్గించి నెమ్మదిగా వచ్చేలా ప్లాన్ చేశారు. దీంతో పోటెత్తి పరుగులు తీసే అవసరం కనిపించలేదు. ఫలితంగా తోపులాటరహిత గరుడోత్సవాన్ని నిర్వహించగలిగారు.

◆ అనుభవమే పాఠాలుగా..

గత అనుభవాల నిర్వహణలో అనుభవం ఉన్న అధికారుల ప్రణాళికాబద్ధ కృషి. ఈఏడాది బ్రహ్మోత్సవాల దిగ్విజయం వెనుక కనిపిస్తోంది. ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ గతంతో ఐదు బ్రహ్మోత్సవాలను నిర్వహించారు. అలాగే అదనపు ఈవో వెంకయ్య చౌదరి కూడా గత బ్రహ్మోత్సవంలో లోటుపాట్లను గమనించిన అధికారే. ఇక, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు పాత వారే కావడంతో గతకాలపు లోటుపాట్లను సమీక్షించుకుని ఈసారి వాటన్నింటికీ చెక్ పెట్టగలిగారు. టీటీడీలో గతంలో పనిచేసిన అధికారులు, కీలక బాధ్యతలు నిర్వహించిన సిబ్బంది, కొందరు భక్తులు, మీడియా నుంచి ముందస్తుగా సేకరించిన సమాచారంతో సమర్థవంతమైన ఏర్పాట్లు చేసి సక్సెస్ అయ్యారు. భక్తుల నుంచి ఆకలి అనే మాట వినిపించకుండా నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు, మజ్జిగ అందజేసి శభాష్ అనిపించుకున్నారు.

◆ ఆ ఇద్దరి కృషి...

ఈఏడాది బ్రహ్మోత్సవాలను పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలనే లక్ష్యంతో అదనపు ఈవో వెంకయ్య చౌదరి మూడునెలలుగా విశేషంగా కృషి చేశారు. అన్ని విభాగాలతో దఫాల వారీగా సమీక్షలు నిర్వహించి అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. ఉత్సవాలు ప్రారంభానికి ముందురోజు వరకు సూక్ష్మస్థాయిలో ఏర్పాట్లపై చర్చించారు. దురదృష్టవశాత్తు ధ్వజారోహణం రోజే ఆయన తండ్రి చలమయ్య కన్నుమూయడంతో బ్రహ్మోత్సవాలకు దూరంకావాల్సి వచ్చింది. ఈ సమీక్షల్లో, ఏర్పాట్లలో బ్రహ్మోత్సవాల ముందు బదిలీపై వెళ్లిన ఈవో శ్యామలరావు పాత్ర కూడా చాలానే ఉంది.

◆ వీఐపీల హడావుడి లేదు

సాధారణంగా బ్రహ్మోత్సవాల్లో రాజకీయ నాయకుల హడావుడి చాలానే ఉంటుంది. వారి బంధువులు, మిత్రులు, అనుచరులు చేసే హంగామా సాధారణ భక్తులకు ఇబ్బందిగా ఉంటుంది. అధికారులు వారిని వారించలేక సతమతం అవుతూ ఉంటారు. ఈ ఏడాది మాత్రం వీఐపీల హడావుడి పెద్దగా కనిపించలేదు. హైకోర్టు న్యాయమూర్తులు, ఓ రాష్ట్ర మంత్రి మినహా మిగిలినవారెవ్వరు వాహనాల ముందు లేకపోవడంతో వాహనసేవలు ప్రశాంతంగా జరిగాయి.

◆ పెరిగిన ఆర్టీసీ సేవలు

2023 బ్రహ్మోత్సవాల్లో (ఎనిమిది రోజుల్లో) 5.5 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, గతేడాది 6 లక్షల మందికి దర్శనం లభించింది. కాగా, ఈఏడాది ఎనిమిదిరోజుల్లో 5.80 లక్షల మంది దర్శించుకున్నారు. ఇక హుండీ ఆదాయం 2023లో రూ.24 కోట్లు, 2024లో రూ.26 కోట్లు లభించగా ఈఏడాది రూ.25.12 కోట్లు లభించింది. ఇక ఆర్టీసీ సేవలు ఈ ఏడాది రికార్డు సృష్టించాయి. గతేడాది గరుడసేవ రోజున 1.86 లక్షల మంది తిరుమల-తిరుపతి మధ్య ప్రయాణించగా, ఈ ఏడాది రికార్డుస్థాయిలో 2.16 లక్షల మంది ఆర్టీసీ బస్సులను వినియోగించుకున్నారు.

కళల పండుగ.. కనుల నిండుగ

ఈసారి బ్రహ్మోత్సవాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఈశాన్య రాష్ట్రాల కళాకారుల ప్రదర్శనలు దక్షిణాదికి ఈ బ్రహ్మోత్సవాలు పరిచయం చేశాయి. గతేడాది 18 రాష్ట్రాల నుంచి 6,884 మంది కళాకారులు ప్రదర్శనలు ఇవ్వగా, ఈ ఏడాది అత్యధికంగా 28 రాష్ట్రా నుంచి 6,060 మంది కళాకారులు వాహనాల ముందు ప్రదర్శనలిచ్చారు.

◆ ఫల, పుష్ప ప్రదర్శనలో కొరవడిన కొత్తదనం

కల్యాణవేదికలో ఏర్పాటు చేసిన ఫల, పుష్ప ప్రదర్శన శాలకు భక్తులు భారీ సంఖ్యలోనే హాజరయ్యారు. అయితే కొత్తదనం కొరవడిందనే వ్యాఖ్యలు వినిపించాయి. నాలుగైదేళ్లుగా చేసిన అలంకరణలకు దగ్గరగానే ఈ ఏడాది కూడా ఉన్నాయి. శ్రీకృష్ణలీలల చిత్రాలు కొంత ఆకట్టుకున్నాయి. ప్రతి ఏడాదీ స్థానిక చిత్రకారులతో ఏదో ఒక అంశం మీద చిత్రాలు వేయించి ప్రదర్శనలో ఉంచితే మరింత ఆకర్షణీయంగా ఉంటుంది.

తిరుపతికి ఉగ్ర బెదిరింపులు

● పుణ్యక్షేత్రాల్లో ముమ్మరంగా తనిఖీలు
● ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని తేల్చిన బీడీ టీమ్‌లు



తిరుపతిలో తనిఖీలు చేస్తున్న అధికారులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఐఎస్ఐ, ఎల్‌టీటీఈ పేలుళ్లకు కుట్రపన్నాయి ఉగ్రవాదుల పేరిట తిరుపతికి బెదిరింపులు వచ్చాయి. 'పుణ్యక్షేత్రమైన తిరుపతిలో పాకిస్థాన్ ఐఎస్ఐ, ఎల్టీటీఈ పేలుళ్లకు కుట్ర పన్నాయి. నాలుగు చోట్ల 'ఆర్డీఎక్స్ ఐఈడీ' పేలుడు పదార్థాలు త్వరలో పేలనున్నాయి. శుక్రవారం ఈ పేలుళ్లు జరగనున్నాయి' అంటూ శబరీశన్ వేదమూర్తి పేరిట టీటీడీ డోనార్ సెల్‌కు మెయిల్స్ వచ్చాయి. తమిళనాడులోని ప్రముఖులకూ బాంబు బెదిరింపులు రావడంతో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో రిజర్వు, పారా మిలటరీ, ఏపీఎస్పీ, ఎస్పీఎఫ్, ఎస్టీఎఫ్‌తో పాటు తిరుమల విజిలెన్సు అధికారులూ రంగంలోకి దిగారు. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి నాలుగు బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్లతో తిరుపతితో పాటు తిరుమలను దాదాపు ఆరు గంటల పాటు జల్లెడ పట్టారు. అన్ని ప్రాంతాల్లోను, ప్రతి లగేజీ వస్తువులు, బ్యాగ్‌లు క్షుణంగా తనిఖీలు చేశారు. బాంబు డిస్పోజల్ స్క్వాడ్ సీఐ నేతృత్వంలో ఏఎస్ఐ రమేష్, సిబ్బంది చాంద్‌భాషా, సిబ్బంది కలసి తిరుమల, తిరుపతిలో గాలించారు. ఈ తనిఖీల్లో ఎలాంటి ప్రమాదకర వస్తువులు లేవని తేల్చారు. ఇదంతా ఉత్తుత్తి బెదిరింపుగా భావించారు. అ అయినప్పటికీ భద్రతా చర్యలను కొనసాగిం చారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండు, శ్రీనివాసం, విష్ణునివాసం, కపిలతీర్థం, గోవిందరాజుల స్వామి గుడి, తిరుమలలోని మాడవీధులు, లడ్డూ కౌంటర్లు, తిరుచానూరు పద్మావతి ఆలయం, శ్రీకాళహస్తీశ్వరాలయం.. ఇలా అన్ని పుణ్యక్షేత్రాల్లో తనిఖీలు చేపట్టారు. సీఎం పర్యటన నేపథ్యంలో అగ్రికల్చర్ కళాశాల హెలిపాడ్‌తో పాటు నారావారిపల్లెలోనూ బాంబు, డాగ్ స్క్వాడ్లతో తనిఖీలు ముమ్మరం చేశారు.

ఊహాగానాలు నమ్మొద్దు

ఎస్పీ 'ఈ మెయిల్స్ సమాచారంపై కేసు నమోదు చేసి, చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావద్దు. అపోహలు, ఊహాగానాలను నమ్మకండి' అని ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు.

'ముక్కంటి' పాలకమండలికి రాష్ట్రస్థాయి ప్రాధాన్యం

● వివిధ నియోజకవర్గాల నుంచి 16 మంది సభ్యుల నియామకం



శ్రీకాళహస్తి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తలమండలికి ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో ప్రాధాన్యం కల్పించింది. ఇప్పటి వరకు చైర్మన్‌తో పాటు సభ్యులకూ స్థానికులకు మాత్రమే అవకాశం కల్పించేవారు. కాగా, రాహుకేతు పూజలతో శ్రీకాళహస్తీశ్వరాలయానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించింది. విదేశీ భక్తులూ తరచూ ఆలయానికి వచ్చి రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకొంటున్నారు. ఈ క్రమంలో ఆలయానికి రాష్ట్రస్థాయిలో ప్రాధాన్యం కల్పించి అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో టీటీడీ తరహాలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచీ 16మంది సభ్యులు, ఒక ప్రత్యేక ఆహ్వానితుడితో కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యుల వివరాలు ఉన్నాయి.

పేరు	అసెంబ్లీ నియోజకవర్గం	పార్టీ
కొట్టే సాయి ప్రసాద్(చైర్మన్)	శ్రీకాళహస్తి	జనసేన
సభ్యులు		
బీలా స్రవంతి	యలమంచలి	టీడీపీ
చిన్నపోల లక్ష్మీనారాయణ	పుటపర్తి	టీడీపీ
డి.లక్ష్మమ్మ	శ్రీకాళహస్తి	టీడీపీ
జి.గోపీనాథ్	శ్రీకాళహస్తి	టీడీపీ
కె.కుసుమ కుమారి	ఒంగోలు	టీడీపీ
కొమ్మనబోయిన రజని	చీరాల	టీడీపీ
నాగరాజు కొప్పెర్ల	చింతలపూడి(ఎస్సీ)	టీడీపీ
పెనగలూరు హేమావతి	కడప	టీడీపీ
కొమ్మరి విజయమ్మ	నెల్లూరు సిటీ	టీడీపీ
రుద్రాక్షుల కౌసల్యమ్మ	వెంకటగిరి	టీడీపీ
దండి రాఘవయ్య	శ్రీకాళహస్తి	జనసేన
పగడాల మురళి	తిరుపతి	జనసేన
వి. గుర్రప్పశెట్టి	శ్రీకాళహస్తి	టీడీపీ
కోలా వైశాలి	శ్రీకాళహస్తి	బీజేపీ
ప్రకాశ్‌రెడ్డి	తెలంగాణ	తెలంగాణ
కల్లె సావిత్రి	రాజంపేట	టీడీపీ
ప్రత్యేక ఆహ్వానితులు		
చగణం శైలజ	శ్రీకాళహస్తి	

తిరుపతికి 'స్వచ్ఛ' అవార్డు

తిరుపతి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు దక్కింది. దేశవ్యాప్తంగా నగరాల్లో పరిశుభ్రతను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ఏటా వివిధ కేటగిరీల్లో స్వచ్ఛ అవార్డును అందిస్తుంటోంది. ఇందులో భాగంగా స్పెషల్ కేటగిరీకింద స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు తిరుపతి ఎంపికైంది. ఇటీవల సూపర్ స్వచ్ఛ్ లీగ్ కేటగిరీలో 3 లక్షల జనాభా కలిగిన నగరాల్లో తిరుపతి అవార్డు దక్కించుకున్న విషయం తెలిసిందే. ఈసారి స్పెషల్ కేటగిరీ కిందఅవార్డు దక్కడంపై కార్పొరేషన్ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమష్టి కృషితోనే స్వచ్ఛ అవార్డులు అందుకుంటున్నామని, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్నట్లు కమిషనర్ మౌర్య చెప్పారు.

7న నారావారిపల్లెకు సీఎం

● కుటుంబ సమేతంగా రానున్న చంద్రబాబు



నారావారిపల్లెలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాని తదితరులు

చంద్రగిరి/తిరుపతి(కలెక్టరేట్/నేరవిభాగం), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా ఈ నెల7న చంద్రగిరి మండలం నారావారిపల్లెకు రానున్నారు. మంత్రి నారా లోకేశ్ కూడా వస్తున్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ఉండవల్లి నుంచి నేరుగా హెలికాప్టర్‌లో బయలుదేరి అగ్రికల్చర్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ్నుంచి నారావారిపల్లెకు వెళ్లి రామ్మూర్తి నాయుడి సమాధి వద్ద నివాళులర్పిస్తారు. అనంతరం 11వ నెల విస్తర కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు సీఎం తిరుగు ప్రయాణమవుతారు. కాగా, సీఎం సతీమణి భువనేశ్వరి, రామ్మూర్తి నాయుడి సతీమణి ఇందిరా 5వ తేది సాయంత్రమే రానున్నారు. ఇక, రంగంపేట హైస్కూల్ సమీపంలో సీఎం పర్యటన కోసం తాత్కాలిక హెలిప్యాడ్ స్థలాన్ని ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం బన్సల్, ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, డీఎస్పీ ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఇక, వ్యవసాయ కళాశాలలో రూ.10లక్షలతో శాశ్వత ప్రాతిపదికన హెలిప్యాడ్ నిర్మిస్తున్నారు. ఇకపై సీఎం పర్యటనకు దీనిని వినియోగించనున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. కాగా, వ్యవసాయ కళాశాల గ్రౌండులో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ వద్ద శుక్రవారం పారా మిలటరీ బలగాలు, డాగ్, బాంబు స్క్వాడ్‌లు తనిఖీలు చేశాయి. అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి, చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, సీఐ ఇమ్రాన్‌భాషా, రిజర్వు బలగాలు పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు.

స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలి

● 'ఖాదీ సంత' ముగింపు కార్యక్రమంలో కేంద్ర మంత్రి మురుగన్



స్టాల్‌ను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి మురగన్

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని కేంద్ర మంత్రి మురుగన్ కోరారు. తిరుపతి నగరం త్యాగరాజ మండపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన 'ఖాదీ సంత' ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 'ఈ వస్తువు మా ఊరుది' అని గొప్పగా చెప్పుకొనే పరిస్థితి రావాలన్నారు. ఆ దిశగా స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించి మన పారిశ్రామికవేత్తలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయాలని విజ్ఞప్తి చేశారు. అమెరికా లాంటి దేశాలు ఎన్ని ఆంక్షలు పెట్టినా భయపడే పరిస్థితి లేదన్నారు. అనంతరం ఆయన స్టాళ్లను సందర్శించారు. కళంకారి వస్త్రాలు, దారుశిల్పాలు తదితరాలను పరిశీలించారు. హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, ఏపీజీబీసీ చైర్‌పర్సన్ సుగుణమ్మ, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. కేంద్ర మంత్రిని గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సత్కరించారు. కాగా, రెండు రోజులపాటు జరిగిన ఈ ఖాదీ సంతలో ప్రదర్శనకు ఉంచిన ఉత్పత్తులు భారీగా అమ్ముడుపోయినట్లు నిర్వాహకులు తెలిపారు.

మూలపల్లి చెరువుకు 'హంద్రీ- నీవా' జలాలు

● రూ.126 కోట్లతో పనులకు మంత్రివర్గ ఆమోదం
● ఫలించిన ఎమ్మెల్యే నానీ కృషి

తిరుపతి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నీవా బ్రాంచి కెనాల్ ద్వారా చంద్రగిరి మండలం నారావారిపల్లె సమీపంలోని మూలపల్లి చెరువుకు హంద్రీ-నీవా జలాలు రానున్నాయి. రూ.126 కోట్లతో ప్రతిపాదించిన ఈ పనులకు రాష్ట్ర మంత్రివర్గం శుక్రవారం ఆమోద ముద్ర వేసింది. 'అన్నమయ్య జిల్లా కేవీపల్లెలోని అడవిపల్లి రిజర్వాయర్ నుంచీ చిత్తూరు తాగునీటి అవసరాలకు నిర్మించిన నీవా బ్రాంచి కెనాల్ పాకాల మండలం మీదుగా వెళుతోంది. ఇక్కడ్నుంచి మూలపల్లి చెరువుకు హంద్రీ నీవా నీటిని తరలించి సాగు, తాగునీటి అవసరాలు తీరుస్తా'నని గత ఎన్నికల్లో పులివర్తి నాని హామీ ఇచ్చారు. ఆ ప్రకారం నీవా బ్రాంచి కెనాల్ నుంచీ మూలపల్లి చెరువుకు, తర్వాత మరో నాలుగు చెరువులకు, ఆపై కళ్యాణి డ్యామ్‌కు నీటిని చేర్చేలా రూ.126.06 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. కాలువ వెంబడి 1154 ఎకరాలకు సాగునీరు.. కళ్యాణి డ్యామ్ ద్వారా తిరుమల, తిరుపతికి తాగునీరూ అందుతుంది. ఈ ప్రతిపాదనలపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ను ఎమ్మెల్యే నాని పలుమార్లు కలిశారు. ఈ క్రమంలో శుక్రవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ పనులను ఆమోదించింది. తద్వారా నాని కృషి ఫలించింది.

వైభవంగా కాళీ, కాలభైరవ కల్యాణం

రామచంద్రాపురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో చివరి రోజైన గురువారం ఏకవీర ఫౌండేషన్ కార్యాలయం వద్ద కాళీ, కాలభైరవ కల్యాణం వైభవంగా నిర్వ హిం చారు. రాయలచెరువుకట్ట భవానీ జలకంఠేశ్వరాలయం, కామాక్షి సమేత కోటి లింగేశ్వ రాలయాల్లో స్వామి అమ్మవార్లకు తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉభయదాత వనమాలిదేవి, కటారి భాస్కర్‌నాయుడు దంపతులు పాల్గొన్నారు.

రుయాలో ఘనంగా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి

తిరుపతి(వైద్యం), అక్టోబరు 3 (ఆంధ్ర జ్యోతి): మహాత్మా గాంధీ, మాజీ పీఎం లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను రుయాస్పత్రిలో గురు వారం ఘనంగా నిర్వహించారు. రుయా సూపరింటెండెంట్ రాధ వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీఎస్ ఆర్ఎంవో శ్రీనివాస్, ఏఆర్ఎంవో హరికృష్ణ పాల్గొన్నారు.

పంచాయతీలు ఆదాయం పెంచుకోవాలి

భాకరాపేట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం కావడానికి వనరులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో గిడ్డయ్య అన్నారు. చిన్నగొట్టిగల్లు మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీల ప్రగతి సూచికపై సర్పంచులు, సచివాలయ సిబ్బందికి శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖర రెడ్డి, సూపరింటెండెంట్ సతీశ్ కుమార్ పాల్గొన్నారు.

అంబికాదేవి ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు


వేడుకల్లో టీడీపీ నేత భువన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి(జీవకోన), అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని దాసరిమఠం కరుమారి అంబికాదేవి ఆలయంలో గురువారం శరన్నవ రాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ నేత భువన్ కుమార్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు ఆలయ నిర్వాహకులు కుమార్‌స్వామి, భాస్కర్, స్వాతి, మోహన, కోటి, విజయ్‌కుమార్, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

మహేష్‌యాదవ్‌కు ఘన సన్మానం



తిరుపతి(జీవకోన), అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక తాతయ్య గుంట గంగమ్మ ఆలయ చైర్మన్ మహేష్‌యాదవ్‌ను వారి బంధు మిత్రులు, అక్కారంపల్లెకు చెందిన మధుసూదన్‌రెడ్డి, ఎం.రామిరెడ్డి, ఎం.చైతన్య, ఎం.మహేష్ ఆలయంలో కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు.

శాప్ చైర్మన్ రవినాయుడికి సన్మానం

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : ఎస్వీ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ టైం స్కేల్ టెక్నికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం శాప్ చైర్మన్ రవినాయుడును ఘనంగా సన్మానించారు. తమ సమస్యలను ఆయనకు విన్నవించారు. సాను కూలంగా స్పందించిన రవినాయుడు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బ్రహ్మోత్సవాల నిర్వహణ బావుంది


ఆలయం ముందు పురందేశ్వరి

తిరుమల, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాను విజయ వంతం చేసిన టీటీడీ చైర్మన్, ఈవో, బోర్డు సభ్యులను బీజేపీ ఎంపీ పురందేశ్వరి అభినందించారు. కుటుంబ సమేతంగా శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ భగవంతుడికి అన్యాయం చేయాలని ప్రత్నించినవారిని భగవంతుడే శిక్షిస్తారని, పరకామణి వంటి విషయాలను ఇప్పటికే చూశామని వ్యాఖ్యానించారు.

క్రీడాపరికరాలపైనా 5 శాతం తగ్గిన జీఎస్టీ

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): క్రీడాపరికరాలకు కూడా 18 నుంచి 5 శాతానికి జీఎస్టీ తగ్గించారని శాప్ చైర్మన్ రవినాయుడు శుక్రవారం తెలిపారు. దీనివల్ల పేద, మధ్యతరగతి ఆటగాళ్లకు ఊరట కలిగిందన్నారు.

తాగి వాహనం నడిపిన ముగ్గురికి రిమాండ్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి రెండు రోజులు, ఒకరికి 10 రోజులు రిమాండ్ విధిస్తూ తిరుపతి నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీ రమాకృష్ణమాచారి నేతృత్వంలో 10 రోజులుగా నగరంలో తనిఖీలు నిర్వహించి, 50మందిపై కేసులు నమోదు చేశారు. వారిని విడతల వారీగా న్యాయమూర్తి ఎదుట హాజరుపరుస్తున్నారు. 13 మందిని హాజరుపరచగా ముగ్గురికి రిమాండ్, మరో 10 మందికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు.

కొనసాగుతున్న పీహెచ్‌సీ డాక్టర్ల సమ్మె

తిరుపతి(వైద్యం), అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ముందు పీహెచ్‌సీ డాక్టర్లు చేపట్టిన సమ్మె మూడవ రోజుకు చేరుకుంది. శుక్రవారం పలు యూనియన్లు వారికి మద్దతుగా నిలిచాయి. ఏపీపీహెచ్‌సీడీఏ నేతలు డాక్టర్ చత్రప్రకాష్, రూప్‌కుమార్ పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలు మహిళా సాధికారతకు భరోసా

భాకరాపేట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలు మహిళా సాధికారతకు భరోసా కల్పిస్తున్నట్లు వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ కరీం బాషా తెలిపారు. జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు.

అలరించిన అన్నమయ్య సంకీర్తన


అన్నమయ్య సంకీర్తనలను ఆలపిస్తున్న కళాకారులు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : తిరుపతి ఎస్వీ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ కళాశాల ఆధ్వర్యంలో గురువారం రాత్రి తిరుమల ఆస్థాన మండపంలో అధ్యాపకులు వై.వెంకటేశ్వర్లు, ఆయన శిష్యబృందం అన్నమయ్య సంకీర్తన అలరించింది. కళాశాల ప్రిన్సిపాల్ ఉమా ముద్దబాల సారథ్యంలో జరిగిన పలు సంకీర్తనలు ఆలపించి భక్తిపారవశ్యాన్ని నింపారు. శిష్యబృందం సభ్యులు లీలావతి, వెంకటరాజు, మాధురి, జ్యోతి, వెంకటరమణ పాల్గొన్నారు.

కరిరాజుపై అలిమేలుమంగ అభయం

తిరుచానూరు, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు అలమేలుమంగమ్మ గజ వాహనంపై కొలువుదీరి ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. మధ్యాహ్నం తిరుమంజనం నిర్వహించారు. రాత్రి గజవాహన సేవ అత్యంత వేడుకగా జరిగింది. డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

వేడుకగా చక్రస్నానం

తిరుపతిరూరల్, అక్టోబరు3 (ఆంధ్ర జ్యోతి): తుమ్మలగుంట కల్యాణ వేంక టేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు గురువారం ఉదయం చక్ర స్నాన క్రతువుని శాస్త్రోక్తంగా నిర్వ హించారు. చక్రతళ్వార్‌కి పుష్కరిణిలో పవిత్ర స్నానం చేయించారు. భక్తులు పెద్దయెత్తున పుణ్య స్నానాలను ఆచరించి మొక్కు చెల్లించారు. అదేరోజు సాయంత్రం ప్రధాన ఆలయం ముందున్న యాగ శాలలో మహా పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించి ఉత్సవాలకు ముగింపు పలికారు. చెవిరెడ్డి లక్ష్మి, మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయ బోర్డు సభ్యుడిగా 'చిరంజీవి' మురళి



తిరుపతి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) :శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి సభ్యుడిగా పగడాల మురళి అలియాస్ చిరంజీవి మురళి నియమితులయ్యారు. చిరంజీవి అభిమానిగా, మెగా కుటుం బానికి అత్యంత ఆప్తుడిగా ఉన్న ఆయన ప్రజారాజ్యం నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. చిరంజీవి కుటుంబ సభ్యులు తిరుమలకు వచ్చినప్పుడు తానే దగ్గరగా ఉంటారన్న పేరుంది. గత వైసీపీ ప్రభు త్వంలో అతని వ్యాపారాలను దెబ్బతీసే ప్రయత్నం చేసి లొంగదీసుకునేందుకు విఫలయత్నం చేసింది. మెగా కుటుంబంపై ఉన్న అభిమానంతో జనసేన పార్టీ కార్య కలాపాలకు వెన్నుదన్నుగా నిలుస్తూ వచ్చారు. ఈ క్రమంలో ఆయనకు ముక్కంటి ఆలయ పాలకమండలి సభ్యుడిగా అవకాశం దక్కింది. మురళి నియామకంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

ఆరోగ్య వరప్రసాదినికి రూ.30 లక్షల విరాళం



తిరుమల, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆరోగ్యవరప్రసాదిని (స్విమ్స్) పథకానికి గురువారం రూ.30 లక్షలు విరాళంగా అందింది. ఖమ్మంకు చెందిన గుర్రం వెంకటేశ్వర్లు టెక్స్‌టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ అంకిత్ తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి విరాళం చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యుడు శాంతారామ్ పాల్గొన్నారు.

కార్పొరేట్ల సేవల్లో డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు

- బీవీ రాఘవులు విమర్శ

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వంలో భాగస్వాములై ఉన్న రాష్ట్రాల్లో (డబుల్ ఇంజన్ సర్కార్లు) ప్రభుత్వాలు బడా కార్పొరేట్లకు దోచిపెట్టే సేవల్లో తరించి పోతున్నాయని సీపీఎం జాతీయ నాయకుడు బీవీ రాఘవులు విమర్శించారు. పేద, మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపుతూ తమ సేవలు అమోఘమంటూ డప్పులు కొట్టుకుంటున్నాయని ఆరోపించారు. 'డబుల్ ఇంజన్ సర్కార్-ప్రమాదంలో ప్రజాస్వామ్యం' అంశంపై శుక్రవారం తిరుపతిలో జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో ఏది అభివృద్ధి చెందిందో ప్రధాని మోదీ ప్రకటించాలన్నారు. రాష్ట్రానికి ఇప్పటి వరకు రాజధాని లేక పోవడానికి చంద్రబాబు, వైఎస్ జగన్ బాధ్యత వహించాలన్నారు. 13 గంటల పని విధానంపై ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఇసుక అక్రమ రవాణాలో వైసీపీ, టీడీపీ ఒక్కటేనని ఆరోపించారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేట కూడలిలో అంబేడ్కర్ విగ్రహాన్ని తగులబెట్టిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.

ముగిసిన ఎల్లమ్మ దేవీనవరాత్రి ఉత్సవాలు



మహిషాసుర మర్దినిగా ఉగ్రప్రత్యంగిరాదేవి


పుష్పపల్లకిలో మహిషాసుర మర్దినిగా మూలస్థాన ఎల్లమ్మ


మిట్టమీద గంగమ్మ ఆలయంలో శమీపూజ

చంద్రగిరి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మ ఆలయ దేవీనవరాత్రి ఉత్సవాలు గురువారం ముగిశాయి. చివరి రోజు అమ్మవారు పుష్పపల్లకిలో మహిషాసుర మర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని ఆలయ ఆవరణలోకి తీసుకొచ్చి పట్టుపీతాంబరాలు, బంగారు ఆభరణాలతో మహిషాసుర మర్దిని అలంకరణ చేసి పుష్పపల్లకిపై అధిష్ఠించి, చంద్రగిరి వీధుల్లో ఊరేగించారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో మమత, ఉభయదారులు మణ్యం మునిరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మిట్టమీద గంగమ్మ ఆలయంలోనూ గురువారం అభిషేకాలు చేసి, విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి, పెద్దశేష వాహనంపై అధిష్టించి శమీ పూజ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం ఉత్సవమూర్తిని మహిషాసుర మర్దిని అలంకరణలో పుష్పపల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు. శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయ ఆవరణలోని సంతోషిమాతకు రాజరాజేశ్వరి సహస్రనామార్చన చేశారు. తొండవాడలోని ఉగ్రప్రత్యంగిరాదేవి ఆలయంలో ఉదయం ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తి గురువారం దశమి దుర్గగా మహిషాసుర మర్దిని అలంకరణ చేశారు. శుక్రవారం ఏకాదశి దుర్గగా ఉగ్రప్రత్యంగిరాకాళి అలంకరణ చేసి, గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ పీఠాధిపతి సూరిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శరన్నవరాత్రి వేడుకలు


రాజరాజేశ్వరి అలంకారంలో శక్తిచాముండేశ్వరి


రాజరాజేశ్వరి అలంకారంలో మూలస్థాన ఎల్లమ్మ

తిరుపతిరూరల్, అక్టోబరు3 (ఆంధ్ర జ్యోతి): తిరుపతిరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన దేవీశరన్నవరాత్రి వేడుకలు గురువారంతో ముగిశాయి. తుమ్మలగుంట ఎల్ఎస్ నగర్‌లో వెలసిన శక్తిచాముండేశ్వరీదేవి చివరిరోజు రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు అభయమిచ్చారు. అమ్మవారికి అభిషేకం, హోమం, అన్నదానం నిర్వహించారు. రత్నమ్మ, వెంకట్రామయ్య, లక్ష్మి, భాస్కర్‌రెడ్డి, శంకర్‌నాయుడు, కుమార్, తంబిరెడ్డి, లత, చంద్రమోహన్‌రెడ్డి, నాగరత్నమ్మ, బాలయ్యబాబు, హరితారెడ్డి, కరిష్మారెడ్డి, హర్షిత్‌రెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, సివిల్‌సప్లైస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సైకం జయచంద్రారెడ్డి, తిరుచానూరు ఏఎంసీ చైర్మన్ మౌనిక, మునిశేఖర్ రాయల్ దంపతులు, ఎస్వీయూ పోలీస్‌స్టేషన్ సీఐ చంద్రశేఖర్ దంపతులు, టీడీపీ నేత ఆనందగౌడ్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త బిరుదాల భాస్కర్ రెడ్డి, బిరుదాల హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు. ● తుమ్మలగుంట చెంచువారికాలనీలోని మూలస్థాన ఎల్లమ్మ రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అభిషేకం, హోమం, అన్నదానం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బిరుదాల సిద్ధారెడ్డి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూముల రీసర్వేకు సహకరించాలి

రామచంద్రాపురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూముల రీసర్వేకు రైతులందరూ సహకరించాలని తహసీల్దారు మధుసూదన్‌రావు కోరారు. మండలంలోని కమ్మపల్లి, కట్టకింద వెంకటాపురం రెవెన్యూ గ్రామాల్లో శుక్రవారం మూడవ విడత రీసర్వేపై కేకేవీపురంలో గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూ రీసర్వేకు సం బంధించి సంబంధిత రైతులందరికీ నోటీసులు అందజేస్తామన్నారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దారు అమృత మాట్లాడుతూ నోటీసులు తీసుకున్న రైతులందరూ సర్వే సమయానికి తప్పక హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. రీసర్వే ద్వారా భూమి సరిహద్దులు, ప్రభుత్వ భూములు గుర్తించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్వేయర్ తరుణ్, వీఆర్వో నరసింహులు, ప్రదీప్ నాయుడు, మాజీ సర్పంచ్ రాఘవేంద్రనాయుడు పాల్గొన్నారు.

మధురానగర్‌లో మందుబాబుల చిందులు

ఇద్దరికి గాయాలు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మళ్లీ మందుబాబుల ఆగడాలు పెరుగుతున్నాయి. తాజాగా గురువారం రాత్రి మధురానగర్, ఇర్లానగర్, రైల్వే కాలనీ, చేపల మార్కెట్ ప్రాంతాల్లోని రోడ్డపై మందుబాబులు చిందులు వేశారు. రోడ్డుపై బాణసంచా కాలుస్తూ బీరు బాటిళ్లను చేతిలో పెట్టుకుని దారిన వెళ్లే వారిని దుర్భాషలాడారు. ఎదురుతిరిగిన వారితో వాగ్వివాదానికి దిగారు. చేపల మార్కెట్ ఎదురుగా ఉన్న రోడ్డుపై కొందరు అకతాయిలు, యువకులు, పోకిరీలు విచ్చలవిడిగా మందు తాగుతూ వీరవిహారం చేశారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిపట్ల అసభ్యంగా ప్రవర్తించారు. చిన్నపాటి ఘర్షణలు జరగడంతో మధురానగర్, రైల్వే కాలనీకి చెందిన ఇద్దరు అకతాయిలకు తల, వీపుపై తీవ్ర గాయాలయ్యాయి. రైల్వే కాలనీలో అర్ధరాత్రి వరకు దుకాణాలు నిర్వహిస్తుండటంతో శాంతిభద్రతలు లోపిస్తున్నాయి. రాత్రి 9నుంచి అర్ధ రాత్రి ఒంటి గంట వరకు కొందరు చోటామోటా రాజకీయ నాయకులు, కార్యకర్తలు, దుకాణల సిబ్బంది అక్కడే కూర్చుని మద్యం తాగుతుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు స్పందించి అకతాయిలు, మందుబాబుల ఆగడాలకు చెక్ పెట్టాలని స్థానికులు ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

గంగమ్మ ఆలయానికి రండి

- నారా రామ్మూర్తి కుటుంబానికి ఆహ్వానం


నారా గిరీష్‌ను సత్కరిస్తున్న గంగమ్మ మహేష్ యాదవ్

తిరుపతి అక్టోబర్3(ఆంధ్రజ్యోతి) : దివంగత మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు కుమారుడు గిరీష్‌ను శుక్రవారం తాతయ్యగుంట గంగమ్మ గుడి చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్, శాప్ చైర్మన్ రవి నాయుడు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించారు. అంతకుముందు రామ్మూర్తినాయుడు సతీమణి ఇందిరమ్మను కూడా మహేష్ యాదవ్ గంగమ్మ గుడికి రావలసిందిగా ఆహ్వానించారు. వీరితోపాటు రంజిత్, తోట వాసు, సునీల్, మధు తదితరులు పాల్గొన్నారు.

తలకోన ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకారం



ఎర్రావారిపాలెం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి); తలకోన సిద్ధేశ్వరస్వామి ఆలయ పాలక మండలి కొలువుదీరింది. చైర్మన్‌గా మండలంలోని ఎల్లమందకు చెందిన సోమనాథ రెడ్డి, సభ్యులుగా వీఆర్ అగ్రహారానికి చెందిన శిరివేలు రమేష్, నెరబైలుకు చెందిన శశికళ, చెంగమ్మ, ఉస్తికాయల పెంటకు చెందిన రాజన్న, బోడేవాండ్లపల్లెకు చెందిన ఇందిర, బాయికాడ కమ్మపల్లెకు చెందిన లంకిపల్లె శోభ, కోటకాడపల్లెకు చెందిన చలపతి, ఎం ఈశ్వరయ్య, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఆలయ అర్చకుడు సత్యప్రసాద్ ప్రమాణస్వీకారం చేశారు. దేవదాయ శాఖ ప్రత్యేకాధికారి శశికుమార్ ఆలయ ప్రాంగణంలో వారితో ప్రమాణం చేయించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని సహకారంతో ఆలయాభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ తెలిపింది. ఈ కమిటీ రెండేళ్లపాటు పదవిలో ఉంటుంది.

ఎన్నికలను అపహాస్యం చేస్తున్న బీజేపీ: గిడుగు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దేశంలో ఎన్నికల ప్రక్రియను బీజేపీ అపహాస్యం చేస్తుందని సీడబ్ల్యూసీ సభ్యుడు, పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ సాక్ష్యాలసహా బయట పెట్టారన్నారు. వివిధ రాష్ట్రాల్లో ఎన్నికల తీరు, ఫలితాలను పరిశీలిస్తే ఎన్నికల సంఘాన్ని బీజేపీ అడ్డుపెట్టుకుని మోసాలు చేస్తోందని తెలుస్తుందన్నారు. అంతకుముందు గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు నివాళులు అర్పించారు. జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షులు బాలగురవం బాబు, చిట్టిబాబు, నాయకులు రాంభూపాల్‌రెడ్డి, భాస్కర్, వెంకట నరసింహులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి స్వర్ణోత్సవం


వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే నాని, టీటీడీ బోర్డు మెంబర్ పనబాక లక్ష్మి

చంద్రగిరి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయి మందిరంలో సత్యసాయి బాబా స్వర్ణోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని పునఃనిర్మించిన సందర్భంగా ఈ వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు, టీటీడీ బోర్డు మెంబర్ పనబాక లక్ష్మి హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా తిరుపతి సంస్కృత విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ కృష్ణమూర్తి, డాక్టర్ స్వామ్రాజ్య లక్ష్మి, డాక్టర్ ప్రసాద్ గొరినేని, ఎస్వీడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణమ్మ, తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షురాలు శ్రీదేవి, సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు భరణి కుమార్, కన్వీనర్ సునీల్ బాబు, కిశోర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి ఊరేగింపు



పాకాల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక బజారువీధిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ దసరా మహోత్సవాల్లో చివరి రోజైన గురువారం అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక వాహనంలో అమ్మవారిని కొలువుదీర్చి పుష్పాలతో అలంకరించి మేళతాళాలతో పురవీధులలో ఊరేగించారు. ఉత్సవాలలో పదిరోజుల పాటు ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చన నిర్వహించారు. ఆర్యవైశ్య కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్, మహిళా మండలి, యువజన సంఘం, బాలల సంఘం సభ్యులు పాల్గొన్నారు. నేండ్రగుంట మూల స్థానమ్మ ఆలయంలో గురువారం రాజరాజేశ్వరిదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. రాత్రి అమ్మవారిని ఊరేగించారు. మూలస్థానమ్మ ఆలయ కమిటీ సభ్యులు, నేండ్రగుంట గ్రామస్తులు పాల్గొన్నారు.

తిరుమలలో గాయని ఉష



తిరుమల, అక్టోబరు 3 (ఆంధ్ర జ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో సినీ గాయని ఉష దర్శించుకున్నారు. ఈమెకు ఆలయాధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు.

కేసీపేట భూ సమస్యలకు త్వరలో పరిష్కారం

గ్రామస్తుల సమావేశంలో ఎమ్మెల్యే నాని


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

తిరుపతిరూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న కేసీపేట గ్రామ భూ సమస్యకు త్వరితగతిన పరిష్కారం లభించే దిశగా చర్యలు చేపట్టామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. గ్రామంలోని రామాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం విడతలవారీగా భూ సమస్యలను పరిష్కరిస్తా మన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా వారు కలెక్టర్‌ను ఆదేశించారని వివరించారు. గ్రామంలో 68 సర్వే నంబర్లు(షైమాశి) ఉన్నాయని, రైతులు తమ భూములకు సంబంధించిన రికార్డులు, ఆధార్ కార్డులను రెవెన్యూ అధికారులకు అందించాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గ్రామస్తులకు చెప్పిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. ఆర్డీవో రామ్మోహన్, రూరల్ మండల తహసీల్దార్ రామాంజుల నాయక్ మాట్లాడుతూ కలెక్టర్, జేసీ ఆదేశాల మేరకు 6 టీమ్స్(విలేజ్‌సర్వేయర్లు, వీఆర్వో, సూపర్‌వైజర్లు)ని భూముల సర్వేకి కేటాయిస్తున్నామని తెలిపారు. రైతులకు ముందుగా సమాచారమిస్తారని, సహకరించాలని కోరారు. టీడీపీ రూరల్ మండలాధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, గ్రామ సర్పంచ్ పిపాసి, సింగిల్‌విండో చైర్మన్ మధుశేఖర్, అమిలినేని మధు, మునిశేఖర్‌రాయల్, కృష్ణమూర్తిరెడ్డి, ముచ్చేలి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్రీడా విభాగంపై అసిస్టెంట్ కలెక్టర్ ఆరా



రవినాయుడితో మాట్లాడుతున్న సందీప్‌రఘువంశీ

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా విభాగం పనితీరుపై అసిస్టెంట్ కలెక్టర్ సందీప్‌రఘువంశీ ఆరా తీశారు. శుక్రవారం ఉదయం ఆయన స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయాన్ని సందర్శించారు. శాప్ చైర్మన్ రవినాయుడిని కలిసి పలు అంశాలపై చర్చించారు. శ్రీనివాస క్రీడా సముదాయంలో పలు క్రీడాంశాలలో శిక్షణ ఇస్తున్నామని, గొల్లవానిగుంటలో మినీ క్రికెట్ స్టేడియం నిర్మాణం జరుగుతోందని రవినాయుడు తెలిపారు. చంద్రగిరిలో క్రీడా వికాస కేంద్రం నిర్మాణంలో ఉందన్నారు. బడ్జెట్‌లో ఏటా క్రీడలకు నిధులు కేటాయిస్తారని, దానికనుగుణంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో వచ్చే ఏడాది ఖేలో ఇండియా, 2029లో జాతీయ క్రీడలు నిర్వహించనున్నామన్నారు. పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని డీఎస్‌డీవో శశిధర్‌ను అసిస్టెంట్ కలెక్టర్ కోరారు.

పోలీసు అధికారులకు ఆత్మీయ వీడ్కోలు



ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులతో ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి (నేర విభాగం), అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులకు శుక్రవారం తిరుపతి పోలీసు అతిథి గృహంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఇందులో బీఎన్ కండ్రిగ ఎస్‌ఐగా పనిచేసిన విశ్వనాథనాయుడు, చంద్రగిరిలో ఏఎస్‌ఐగా పనిచేసిన రవిబాబు, తిరుపతి డీసీఆర్బీలో ఏఎస్‌ఐగా పనిచేసిన శ్రీనివాసులు ఉన్నారు. వారికి ఎస్పీ సుబ్బరాయుడు శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. శేషజీవితం కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకట్రావు, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

సామాన్యుల సమస్యలు టీటీడీ పరిష్కరించాలి



శ్రీవారిమెట్టు వ్యాపారుల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న రాఘవులు

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మానవసేవే మాధవసేవ అని ప్రచారం చేసుకుంటున్న టీటీడీ యాజమాన్యం శ్రీవారిమెట్టు చిరు వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు కోరారు. శుక్రవారం తిరుపతి కేటీ రోడ్డులోని టీటీడీ పరిపాలన భవనం ఎదుట 408 రోజులుగా దీక్షలు చేస్తున్న వ్యాపారులకు ఆయన సంఘీభావం తెలిపారు. చిరు వ్యాపారులు న్యాయం కోసం 14 నెలలుగా దీక్షలు చేయాలా అని ప్రశ్నించారు. వీఆర్ నాయుడు, అనిల్ కుమార్ సింఘాల్ లాంటి వారు స్పందించి వెంటనే ఈ చిన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. నాయకులు కందారపు మురళి, జయచంద్ర, మధు, చిట్టిబాబు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు

తిరుపతి, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎమ్మార్‌పల్లె శ్మశాన స్థల వివాదంపై పోలీసులు దృష్టి సారించారు. రాజకీయ పార్టీలు రోడ్డెక్కి నిరాధార ఆరోపణలతో గందరగోళం సృష్టించడాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. వైసీపీ నాయకుల ఆరోపణలపై డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ టెంట్ వేసి కూర్చుని సవాల్ చేయడం, ఆర్సీ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తామని వైసీపీ నేతలు పుకార్లు పుట్టించడంపై పోలీసులు రంగంలోకి దిగారు. ఇరువర్గాల నుంచే కాకుండా స్థానికులు, రెవెన్యూ అధికారుల నుంచి సమాచారం సేకరించారు. ఈ వివాదాన్ని రాజకీయ పార్టీలు కొనసాగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్టు సమాచారం. ఈ వివాదానికి రెవెన్యూ అధికారులు తెరదించుతారని, అప్పటివరకు ఇరువర్గాలు సంయమనం పాటించాలని చెప్పినట్టు తెలిసింది.

తిరుపతి

అన్నదానం



అన్నదానం చేస్తున్న అశోక్‌సామ్రాట్ యాదవ్

తిరుపతి అర్బన్, అక్టోబర్ 3(ఆంధ్రజ్యోతి): విజయదశమిని పురస్కరించుకుని గురువారం స్థానిక వేశాలమ్మగుడి వద్ద వివేకానంద ట్రస్టు అధ్యక్షుడు ఎస్.అశోక్‌సామ్రాట్‌యాదవ్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. కార్పొరేటర్ నరసింహాచారి, బీసీ సంఘం నాయకులు అక్కినపల్లి లక్ష్మయ్య, నక్క భాస్కర్‌యాదవ్, సురేష్‌బాబు, కృష్ణమూర్తి, దొరస్వామి, బుసగాని లక్ష్మణయాదవ్, వడ్డెర రమణ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా కేంద్ర ట్రస్టు ఆధ్వర్యంలో..



అన్నదానం చేస్తున్న పీసీ రాయలు

తిరుపతి అర్బన్, (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీ రోడ్డులోని కస్తూర్బా కేంద్ర ట్రస్టు చైర్మన్ పీసీ రాయలు ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. గాంధీరోడ్డు, గాంధీ భవన్‌లలో దాదాపు వెయ్యిమందికి అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, నాయకులు అజయ్‌కుమార్, వరప్రసాద్, రుద్రరాజు శ్రీదేవి, బండి మధుసూదన్‌రెడ్డి, ఉదయగిరి కృష్ణమూర్తి, శివన్న, షాబుద్దీన్ పాల్గొన్నారు.

ఘనంగా దసరా వేడుకలు

రాజరాజేశ్వరీదేవి అలంకారంలో అమ్మవార్ల దర్శనం

- శివపార్వతుల రూపంలో కపిలేశ్వరాలయ కామాక్షిదేవి



రాజరాజేశ్వరిదేవిగా తాతయ్యగుంట గంగమ్మ

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : నగరంలో గురువారం దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు చేసి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం ముందు మండపంలో ప్రతిష్ఠించిన నవదుర్గల కలశాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. హోమ పూజలు జరిపి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం ఉత్సవమూర్తికి రాజరాజేశ్వరి దేవి అలంకారం చేసి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పాలకమండలి చైర్మన్ నైనారు మహేష్ యాదవ్, సభ్యులు, ఈవో జయకుమార్ పాల్గొన్నారు. పల్లివీధిలోని వేశాలమ్మ, ఆర్టీసీ బస్టాండు సమీపంలోని తాళ్లపాక పెద్దగంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి, అమ్మవార్లకు రాజరాజేశ్వరిదేవి అలంకారం చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం వేశాలమ్మ ఉత్సవ మూర్తి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. పాత మున్సిపల్ ఆఫీసు అనుకుని ఉండే నడివీధి గంగమ్మ ఆలయంలో అమ్మవారికి రాజరాజేశ్వరిదేవి అలంకారం చేసి, సాయంత్రం ఊరేగించారు. కపిలేశ్వరస్వామి ఆలయంలో కామాక్షి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. శివపార్వతుల అలంకారంలో అమ్మవారు భక్తులను కటాక్షించారు. సాయంత్రం అమ్మవారి ఊంజల్ సేవ వేడుకగా సాగింది. ఆయా ఆలయాల్లో భక్తులు దీపాలు వెలిగించి, పూజలు చేశారు.



రాజరాజేశ్వరిదేవిగా పల్లివీధి వేశాలమ్మ



నడివీధి గంగమ్మ ఊరేగింపు



ప్రత్యేక అలంకరణలో బొంతాలమ్మ

క్లీన్ అండ్ గ్రీన్‌లో 14వేల మొక్కలు నాటాం

'స్వచ్ఛతా హి సేవ'లో కమిషనర్ మౌర్య



పారిశుధ్య కార్మికులకు కిట్లు అందజేస్తున్న కమిషనర్ మౌర్య, నాయకులు నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ

తిరుపతి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : నగర పరిశుభ్రత ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి స్వచ్ఛతా హి సేవలో భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య కోరారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం కార్యాలయ ఆవరణలో పారిశుధ్య కార్మికులకు రక్షణ కిట్లను యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కార్పొరేటర్లు ఎస్కే బాబు, దూదికుమారి, అధికారులతో కలిసి ఆమె పంపిణీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో రెండు వారాలపాటు నిర్వహించిన స్వచ్ఛతా హి సేవలో పారిశుధ్య పనులు, కార్మికులకు వైద్య పరీక్షలు, చెత్త తొలగింపు, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీసీపీ ఖాన్, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, రజక కార్పొరేషన్ డైరెక్టర్ కరాటే చంద్ర పాల్గొన్నారు.

గాంధీకి ఘన నివాళి



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిషనర్ మౌర్య తదితరులు

తిరుపతి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం ఘనంగా నివాళులర్పించారు. గాంధీజీ చిత్ర చిత్రపటానికి కమిషనర్ మౌర్య, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కార్పొరేటర్లు ఎస్కే బాబు, దూదికుమారి పాల్గొని పుష్పాంజలి ఘటించారు. దేశానికి గాంధీ చేసిన సేవలను కమిషనర్ కొనియాడారు. అహింసే ఆయుధంగా ఆయన చూపిన మార్గంలో అందరూ నడవాలని పిలుపునిచ్చారు. అధికారులు పాల్గొన్నారు.

జూపార్కులో అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ



మంగళం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఎస్వీ జూపార్కును గురువారం అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సీనియర్ ఐఏఎస్ అధికారి కాంతిలాల్ దండే సందర్శించారు. ఆత్మకూరు నుంచి తీసుకువచ్చిన పెద్దపులి పిల్లలను, విదేశాల నుంచి తీసుకువచ్చిన జంతువుల ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. జూపార్కు క్యూరేటర్ సెల్వం, రేంజ్ ఆఫీసర్ జగదీష్ పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్...డబుల్ బెన్ఫిట్స్

'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్'పై టీడీపీ ర్యాలీ



తిరుపతి, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి) : డబుల్ ఇంజన్ ఎన్డీయే సర్కార్‌తో ప్రజలకు డబుల్ బెన్ఫిట్స్ అందుతున్నాయని, సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నేతలు పిలుపునిచ్చారు. 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్'పై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ శుక్రవారం టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ నిర్వహించారు. పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం నుంచి గాంధీ రోడ్డు మీదుగా ర్యాలీగా వెళ్తూ జీఎస్టీ గురించి ప్రజలకు అవగాహన పెంచేలా పోస్టర్లను ప్రదర్శించారు. దుకాణాలకు వెళ్లి వినియోగదారులు, విక్రయదారులతో జీఎస్టీ గురించి మాట్లాడారు. సుగుణమ్మ, టీటీడీ పాలక మండలి సభ్యురాలు పనబాక లక్ష్మి మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఆర్థికంగా వెసులుబాటు లభిస్తుందన్నారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, నాయకులు శ్రీధర్ వర్మ, దంపూరి భాస్కర్ యాదవ్, పుష్పావతి యాదవ్, సూరా సుధాకర్ రెడ్డి, ఊట్ల సురేంద్ర నాయుడు, బ్యాంకు శాంతమ్మ, చినబాబు, పాటకం వెంకటేష్, ఆముదాల తులసీరాం పాల్గొన్నారు.

ఇంటికి ఆనుకుని కట్టేశారు

కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన బాధితురాలు





భవనానికి ఆనుకుని మరో ఇంటి నిర్మాణం చేపట్టడంతో బీటలు వారిన గోడ

తిరుపతి, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి) : స్థానిక కపిలతీర్థం రోడ్డులో (డోర్ నెంబరు 6-8-1154) సీనియర్ గాయని బి.పద్మావతి (82) తన ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్నారు. గత ఏడాది ఆమె ఇంటి పక్కన స్థలంలో సుభాష్ అనే వ్యక్తి ఇంటి నిర్మాణం ప్రారంభించాడు. సెల్లార్ తవ్వుతున్నప్పుడు ఆమె ఇంటికి ముప్పు వాటిల్లింది. పునాదుల్లో పగుళ్లు వచ్చాయి. డ్రైనేజీ పైపు లు పగిలిపోయాయి. నిర్మాణదారుడిని పదేపదే ప్రాధేయపడినా పట్టించుకోలేదు. టౌన్ ప్లానింగ్ అధికారులకు నివేదించినా పట్టించుకోలేదు. చివరకు తన పొదుపు కోసం ఉంచుకున్న సుమారు రూ.2.5లక్షలతో మరమ్మతు చేసుకున్నారు. సెల్లార్‌తో జరిగిన నష్టాన్ని పూడ్చుకునేలోపు మరో సమస్య మొదలైంది. భవన నిర్మాణంలో భాగంగా సెట్ బ్యాక్స్ వదలకుండా ఆమె ఇంటికి ఆనుకుని కట్టేశారు. గాలి, వెలుతురు లేకుండా బంధించేశారు. సహనం నశించిన ఆమె నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్యను కలిసి మొరపెట్టుకున్నారు. కమిషనర్ స్పందిస్తూ పరిస్థితి తెలుసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అనుమతులు లేకుండా సెల్లార్‌తోపాటు 5 అంతస్థులు నిర్మించినట్టు అధికారులు గుర్తించినట్టు తెలిసింది. యజమానికి నోటీసులు ఇచ్చేందుకు యంత్రాంగం సిద్ధమైనట్లు సమాచారం.

ఘనంగా విజయదశమి



ఆయుధ పూజ చేస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండులో విజయ దశమి వేడుకలు నిర్వహించారు. వాహనాలకు ఆయుధ పూజ చేశారు. ఆయుధ శాల, కమాండ్ కంట్రోలు కార్యాలయం, పెట్రోలు బంకు, ఎంటీవో కార్యాలయాల వద్ద ఆయుధ పూజ చేశారు. అదనపు ఎస్పీలు రవి మనోహరాచారి, వెంకట్రావు, శ్రీనివాసులు, డీఎస్పీలు వెంకట నారాయణ, రిజర్వు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



గాంధీ జయంతి సందర్భంగా ఆర్టీసీ బస్టాండు సమీపంలోని గాంధీ విగ్రహానికి కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనరు మౌర్య నివాళులు అర్పించారు. కలెక్టరేట్‌లో డీఆర్వో నరసింహులు గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఏవో రమేష్ పాల్గొన్నారు.

- తిరుపతి (కలెక్టరేట్)

పుత్తూరు వార్తలు

వడమాలపేట ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం



ఆర్డీవోకు నోటీసు అందించిన ఎంపీటీసీ సభ్యులు

వడమాలపేట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): వడమాలపేట ఎంపీపీ విజయలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. శుక్రవారం ఆరుగు ఎంపీటీసీ సభ్యులు తిరుపతి ఆర్డీవో రామ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అవిశ్వాస తీర్మానం పెడుతున్నట్లు రాతపూర్వకంగా నోటీసు అందజేశారు. మండలంలో ఏడుగురు ఎంపీటీసీ సభ్యులుండగా అందరూ వైసీపీ సానుభూతిపరులే. ఎంపీపీకి వ్యతిరేకంగా ఎంపీటీసీ సభ్యులు ఉపేంద్ర, లోకేష్, రవి, ప్రతిమ, పుష్పలత, కనకమ్మ అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా సంతకాలు చేయడం విశేషం.

మొరాయించిన అడ్మిషన్ వెబ్‌సైట్

- అన్నా గౌరి మెడికల్ కాలేజీలో గందరగోళం



విద్యార్థులతో మాట్లాడుతున్న కళాశాల నిర్వాహకులు

పుత్తూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా ప్రారంభమైన అన్నా గౌరి మెడికల్ కాలేజీ అడ్మిషన్ల తొలి రోజున సాంకేతిక సమస్యల కారణంగా వెబ్‌సైట్లు కొంత సేపు మొరాయించడంతో విద్యార్థులు గందరగోళానికి గురైనారు. పుత్తూరు- నగరి జాతీయ రహదారి పక్కన పరమేశ్వరమంగళం పరిధిలో కొత్త మెడికల్ కాలేజీ ప్రారంభమైంది. ఈ ఏడాది అడ్మిషన్ల సందర్భంగా ప్రభుత్వ నిబంధనల మేరకు ఫీజు, హాస్టల్ ఫీజును చెల్లించాలని యాజమాన్యం విద్యార్థులను కోరింది. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులకు అర్థం కాక అయోమయంలో గందరగోళం ఏర్పడింది. పరిస్థితిని గమనించిన యాజమాన్యం విద్యార్థులతో సంప్రదించి సర్దుబాటు చేసింది.

ఘనంగా గాంధీ జయంతి

పుత్తూరు అర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యం, అహింసా మార్గాలతో ఎలాంటి సమస్యకైనా పరిష్కారం సాధ్యమని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ, వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముగరెడ్డి, పుత్తూరు ఏఎంసీ చైర్మన్ గణేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్ తదితరులు

పుత్తూరు అర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): సమాజంలోని పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో వ్యర్థాల సేకరణకు రెండు ట్రాక్టర్లను ఆయన ప్రారంభించారు. టీడీపీ నాయకులు షణ్ముగ రెడ్డి, ధనపాల్, గణేష్, యుగంధర్, ఆనంద్, అశోక్, మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీతో ప్రయోజనాలు

వడమాలపేట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నూతన జీఎస్టీతో పేద, మధ్య తరగతి ప్రజలకు బహుళ ప్రయోజనాలు అందుతాయని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. గురువారం వడమాలపేటలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై కరపత్రాలను ఆవిష్కరించారు. నాలుగు స్లాబ్‌లుగా ఉండే జీఎస్టీని కేంద్రప్రభుత్వం రెండు స్లాబ్‌లుగా విభజించిందన్నారు. దీంతో నిత్యావసర వస్తువులు, మందులపై జీరో శాతం జీఎస్టీ అమల్లోకి వచ్చిందన్నారు. చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు దాముయాదవ్, ప్రధాన కార్యదర్శి శివరాయల్, నాయకులు, ఎంపీడీవో హరినాథ్‌బాబు, ఏఓ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వారపుసంత ప్రారంభం



వడమాలపేటలో వారపుసంతను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వడమాలపేట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మౌలిక వసతులతో వారపు సంతను గురువారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన కూరగాయలు చౌకగా అభ్యమయ్యేలా సంతను ఏర్పాటు చేశామన్నారు. దుకాణదారులకు, వినియోగదారులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ డి.ఎస్. గణేష్, డైరెక్టర్లు దాము, లీలావతి, టీడీపీ నాయకులు ధనంజయులు నాయుడు, మునిరత్నం, దాము యాదవ్, శివరాయల్, వెంకటయ్య, కుమార్, లక్ష్మీప్రసన్న, గణపతి, ఉమాపతి రావు, అంజయ్య, ఎంపీడీవో హరినాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం...

దుండగులపై చర్యలు తీసుకోండి



పుత్తూరు టౌన్, అక్టోబర్ 3(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పుత్తూరు అంబేడ్కర్ ట్రస్ట్ భవనం కార్యదర్శి అపరంజి పేర్కొన్నారు. శుక్రవారం ట్రస్ట్ సభ్యులతో కలిసి అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్నా నిర్వహించారు కౌన్సిలర్ సుబ్రమణ్యం, దళిత సంఘ నాయకులు మావిలయ్య, రాజేంద్ర, విజయ్‌కుమార్, ఎలుమలై తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి



సూళ్లూరుపేట: పార్వతీదేవి గ్రామోత్సవంలో ఎమ్మెల్యే విజయశ్రీ, ఆలయ చైర్మన్ ఆదినారాయణ రెడ్డి, టీడీపీ నాయకులు



గూడూరు: విజయదుర్గాదేవి గ్రామోత్సవంలో ఎమ్మెల్యే పాశం



సూళ్లూరుపేట: శయన సేవలో కన్యకాపరమేశ్వరి



సూళ్లూరుపేట: గ్రామోత్సవంలో మహిషాసురమర్దినిగా చెంగాళమ్మ



గూడూరు: గ్రామోత్సవంలో నారాయణమ్మ



నాయుడుపేట: రాజరాజేశ్వరిదేవి అలంకరణలో మూకాంబికాదేవి

వైభవంగా అమ్మవార్ల గ్రామోత్సవం

గూడూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి పట్టణంలో అమ్మవార్ల గ్రామోత్సవాలను వైభవంగా నిర్వహించారు. గతనెల 22వ తేదీన కలశ స్థాపనతో ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. గురువారం రాత్రి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై ఉంచి కలశోద్వాసనకు తరలించి గ్రామోత్సవం జరిపారు. స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠం, నారాయణమ్మ ఆలయం, బజారుకలశంలోని దుర్గాదేవి ఆలయం, రాజ రాజేశ్వరీదేవి ఆలయాల్లో అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. వాల యనందాపురం, బొడ్డుచౌక, వీరారెడ్డిపల్లిలోని మహాలక్ష్మమ్మ అమ్మవార్లను శక్తి రూపంలో అలంకరించి గ్రామోత్సవం జరిపారు. కేరళ వాయిద్యాలు, మంగళ మేళాలు, తప్పెట్లు తాళాలు, పార్వతీమహిషాసుర యుద్ధ నృత్యాలు, కోలాటాలు, కీలుగుర్రాల నృత్యాలు, జింగిరిమేళాలు, తెనాలి బ్యాండ్ యువత చిందుల నడుమ బాణాసంచా పేల్చుతూ వైభవంగా పట్టణ పురవీధుల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు ఊరేగించారు. విజయదుర్గాదేవి ఉపపీఠంలో, ధర్మరాజస్వామి ఆలయాల్లో అమ్మవార్లకు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పూజలు నిర్వహించారు. గ్రామోత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ గీతాకుమారి పర్యవేక్షణలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు ముగిశాయి. చివరిరోజు గురువారం విజయదశమి సందర్భంగా చెంగాళమ్మ పరమేశ్వరిని మహిషాసురమర్ధిని అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి అభిషేకానంతరం పుష్పాలంకరణ చేశారు. అనంతరం చండీయాగం నిర్వహించారు. చండీయాగానికి శింగన ఓబుల్ రెడ్డి, పద్మజారెడ్డి, అలంకారానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్థసారధి దంపతులు అమ్మవారికి సారె, పట్టు వస్త్రాలను సమర్పించారు. రాత్రి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. అలాగే నాగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆర్టీసీ బస్టాండు వద్ద శమీ పూజ చేశారు. ఆలయ పాలక మండలి అధ్యక్షుడు తాటిపర్తి ఆదినారాయణరెడ్డి దంపతులు జమ్మిచెట్టుకు పూజలు చేశారు. రాత్రి శివపార్వతుల గ్రామోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం దంపతులు నాగేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కన్యకాపరమేశ్వరికి శయనసేవ జరిపారు. ఈ సందర్భంగా వసంతోత్సవం, ఊంజల్ సేవ నిర్వహించారు.

నాయుడుపేట: పట్టణంలోని మూకాంబికాదేవి, పోలేరమ్మ, కన్యకా పరమేశ్వరి, మానసాదేవి, దుర్గాదేవి, అంకమ్మ అమ్మవార్లు రాజరాజేశ్వరిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

డక్కిలి: మండలంలోని దేవుడివెల్లంపల్లి స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయంలో పార్వతీదేవి శుక్రవారం రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తుల రద్దీ పెరిగింది.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని మందనాంచరేశ్వరికి బంగారుపూత, కర్ణకమ్మ వీధిలోని హరహర క్షేత్రంలో కాత్యయనీ దేవికి లలితా త్రిపుర సుందరిదేవి అలంకారం, వెంకటేశ్వర స్వామికి మహావిష్ణువుగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ముందుగా ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఓజిలి: మండలంలోని భట్లకనుపూరు, అత్తివరం, ఆరిమేనిపాడు, చిల్లమానుచేను, ఓజిలి, కురుగొండ, కరబల్లవోలు, మనవాలి గ్రామాల్లోని ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. భట్లకనుపూరులో వెలసిన జ్ఞానప్రసూన్నాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యే పూజలు చేశారు.



డక్కిలి: రాజరాజేశ్వరిదేవి అలంకరణలో పార్వతీదేవి



వెంకటగిరి: మందనాంచరేశ్వరికి బంగారు రేకులతో అలంకారం



వెంకటగిరి: లలితాత్రిపురసుందరి అలంకారంలో కాత్యయనీదేవి



గూడూరు: గ్రామోత్సవంలో వాలయనందాపురం మహాలక్ష్మమ్మ



గూడూరు: గ్రామోత్సవంలో ద్రౌపదిదేవి



గూడూరు: గ్రామోత్సవంలో బజారు కలశం దుర్గాదేవి

టీడీపీ హయాంలోనే మున్సిపాలిటీ అభివృద్ధి: పాశం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా

గూడూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలోనే గూడూరు మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆస్పత్రి రోడ్డులో కోటి రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాతో కలిసి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదన్నారు. తాను మున్సిపల్ చైర్మన్ అయినప్పటి నుంచి రెండు దఫాలు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ వంటి పలు అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు. త్వరలోనే పట్టణంలో ప్రజలకు రెండు పూటలా మంచినీటిని సరఫరా చేసేలా చర్యలు చేపడతామన్నారు. అనంతరం స్థానిక మున్సిపాలిటీలో మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన మొదటి అంతస్తులోని కౌన్సిల్ సమావేశ మందిరం, ఇంజనీరింగ్ విభాగాన్ని ప్రారంభించి పారిశుధ్య కార్మికులకు బహుమతులను అందజేశారు. సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా మాట్లాడుతూ నూతన భవనం అందుబాటులోకి రావడంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచు రామయ్య, అబ్దుల్‌రహీం, మట్టం శ్రావణి, కల్పన, వాటంబేడు శివ కుమార్, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0తో రైతులకు ఎంతో మేలు: విజయశ్రీ



వేనాటి పరంధామరెడ్డి కుటుంబసభ్యులను, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని సత్కరిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వేనాటి శ్రీకాంత్‌రెడ్డి

తడ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన జీఎస్టీ 2.0తో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో తడ పీఏసీఎస్ చైర్మన్‌గా వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, డైరెక్టర్లుగా టీకే.రవి, ఎస్.సుధాకర్ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు అవసరమైన ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు, తదితరాలపై జీఎస్టీ తగ్గి రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తుండటంతో మహిళల్లో ఆనందం కనబడుతోందన్నారు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తలకు టీడీపీ అండగా ఉండి న్యాయం చేస్తుందని తెలిపారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వైసీపీ డిజిటల్ బుక్ పేరుతో బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. గత వైసీపీ హయాంలో అప్పటి నాయకుల మాటలు విని అవకతవ కలకు పాల్పడ్డ అధికారులు ఎంతో మంది జైలుపాలు అయ్యారని అన్నారు. ఇప్పుడు అధికారులను బ్లాక్ మెయిల్ చేయడం మంచి పద్ధతి కాదన్నారు. అదే గత ఐదు పర్యాయాల టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇటువంటి తప్పులు ఏమీ లేకపోవడంతో ఒక్క అధికారి సైతం జైలుకు వెళ్లిన పరిస్థితి లేదన్నారు. ఇదే వైసీపీ, టీడీపీ ప్రభుత్వాలకు ఉన్న తేడా అని, ప్రజలు సైతం గుర్తించారని మరోసారి వైసీపీకి అధికారం కట్టబెట్టే ఆస్కారమే లేదన్నారు. పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లుగా బాధ్యతలు తీసుకున్న వారిని టీడీపీ నాయకులు సత్కరించారు. అలాగే దివంగత వేనాటి పరంధామరెడ్డి కుటుంబ సభ్యులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్ర మంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్, టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, మురళీరెడ్డి, సెల్వం, నీలకంఠం, బొమ్మన పళణి, సుదర్శన్ మొదలియార్, ఏజీ కిషోర్, మాధవ నాయుడు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం

పెళ్లకూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరసనంబేడు గ్రామంలో టీడీపీ కార్యాలయాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నంచి కృష్ణయ్య గురువారం ప్రారంభించారు. స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు, నాయకులు మదన్‌మోహన్ నాయుడు, సిద్దులయ్య నాయుడు, కృష్ణమ నాయుడు, కిలారి గోపి, గంగా బత్తిన శ్రీనివాసులు, సన్నారెడ్డి వేణురెడ్డి, వేలూరు రమేష్‌రెడ్డి, సుందర రామిరెడ్డి, మల్లు ప్రసాద్, కృష్ణయ్య, కేశవరెడ్డి, కాంద్ర రమణయ్య, గుంట పూడి రమణయ్య, రఘురామయ్య, సుమన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

కోట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

ఘనంగా విజయదశమి వేడుకలు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడు గ్రామ దేవత వేమాలమ్మ, పల్లమాలలోని పచ్చాలమ్మ, నీర్పాకోటలోని చెంగాళమ్మల కు విజయదశమి పురస్కరించుకుని గ్రామస్తులు గురువారం ఘనంగా పూజలు చేశారు. విజయదశమి వేడుకల్లో భాగంగా భక్తులు దేవతలకు పూలతో అలకంరించి ప్రత్యేక పూజలు చేశారు. 9రోజులు పాటు దేవతలకు భక్తి శ్రద్దలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. బుచ్చినాయుడుకండ్రిగలో స్థిరపడిన రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన వ్యాపారులు వారి మహిళలతో కలసి వేసిన దాండియా నృత్యం ఆకట్టుకుంది.

కల్కి అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోండి

వరదయ్యపాళెం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగ మండలాల సరిహద్దులో ఉన్న కల్కి నిర్మాణాలను కూల్చి వేయాలని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులుకు శుక్రవారం వినతి పత్రం అందించారు. అంజూరు అటవీ ప్రాంతంలో నిర్మించిన గోల్డెన్ టెంపుల్‌కు ఎలాంటి అనుమతులు లేవని సమాచార హక్కుచట్టం ద్వారా ఆర్డీవో కార్యాలయం నుండి సమాచారం అందించారని తెలిపారు. సమాచార హక్కుచట్టం ద్వారా ఇచ్చిన సమాచారం మేరకు కల్కి అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాలని కోరారు.

శ్రీకాళహస్తీశ్వరాలయ

పాలక మండలి సభ్యురలిగా కౌసల్యమ్మ



వెంకటగిరి, అక్టోబర్(ఆంధ్రజ్యోతి) 3: ప్రఖ్యాత శైవక్షేత్రం శ్రీకాళహస్తి దేవస్థానం పాలకమండలి సభ్యులను ప్రభుత్వం శుక్రవారం నియమించింది. ఇందులో వెంకటగిరికి చెందిన టీడీపీ నాయకురాలు రుద్రాక్ష కౌసల్యమ్మకు చోటు దక్కింది. సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు టీడీపీలోనూ క్రియాశీలకంగా ఉన్న కౌశల్యమ్మకి శ్రీకాళహస్తి ఆలయ పాలక మండలిలో చోటు దక్కడం పట్ల పార్టీ టీడీపీ వర్గాల్లో హర్షం వ్యక్తమతోంది. పలువురు నాయకులు ఆమెకు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కృషితో తనకు ఈ పదవి లభించిందని కౌసల్యమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

విశ్రాంత ఎస్ఐ దంపతులకు సన్మానం



బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత నెల 30న పదవీ విరమణ చేసిన ఎస్ఐ విశ్వనాథనాయుడు దంపతులను ఎస్పీ సుబ్బరాయుడు తన కార్యాలయంలో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా 44 సంవత్సరాల పాటు ఎస్ఐగా ఆయన చేసిన సేవలను కొనియాడారు.

ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

వరదయ్యపాళెం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): లోక ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోవర్ధనపురంలోని లోకా ఫౌండేషన్ కార్యాలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు పది రోజుల పాటు ఘనంగా జరిగాయి. చివరి రోజు నవ దుర్గల ఊరేగింపు, రాజరాజేశ్వరి అమ్మవారి పూజలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఫౌండేషన్ ప్రతినిధులు ఆచార్య ఆనంద గిరి, లక్ష్మీ దాసాజీ, లోకేష్ దాసాజీ, సునీల్‌జీ, రమేష్, సేవక్ కల్యాణి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.10వేల విరాళం



నాగశక్తి పీఠాధిపతి చిదానందస్వామికి విరాళం అందజేస్తున్న టీడీపీ నాయకుడు కృష్ణపట్నం చంద్రశేఖర్

కోట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడులో రాజ రాజేశ్వరి ఆలయ నిర్మాణానికి మాజీ ఎంపీటీసీ, టీడీపీ సీనియర్ నాయకుడు కృష్ణపట్నం చంద్రశేఖర్ రూ.10వేలు విరాళంగా ఇచ్చారు. ఆ విరాళాన్ని నాగశక్తి పీఠాధిపతి చిదానంద స్వామికి అందజేశారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ వితరణ

గూడూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తూర్పు వీధికి చెందిన యస్విని అనే విద్యార్థినికి 'అందరి కోసం' సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ల్యాప్‌టాప్ అందజేశారు. ఆ సంస్థ ప్రతినిధి బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి మాట్లాడుతూ 1989లో బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థుల సహకారంతో అందరి కోసం సంస్థను ఏర్పాటు చేసి పేద విద్యార్థుల విద్యాభి వృద్ధికి సహకారం అందిస్తున్నామని తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు దుస్తుల అందజేత

నాయుడుపేట టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు పట్టణానికి చెందిన తంబిరెడ్డి మధుసూదనరెడ్డి దుస్తులు గురువారం అందజేశారు.

శాస్త్రోక్తంగా దక్షిణ కాళికా దేవి ఆలయ కుంభాభిషేకం




గోపురంపై కలశాభిషేకం - ప్రత్యేక అలంకరణలో దక్షిణ కాళికాదేవి

శ్రీకాళహస్తి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేడాంలో కొలువై ఉన్న దక్షిణా కాళికాదేవి ఆలయ మహాసంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవం గురువారం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ మండప పునఃప్రారంభం నేపథ్యంలో ఒంగోలు సనాతన శాంకరీ పీఠం పీఠాధిపతి నరసయ్యాచార్య ఆధ్వర్యంలో సుప్రభాతం, వేద పారాయణం, గణపతి పూజ, రక్షా బంధనం, గంగాజల పూజ, గోపూజ, లక్ష్మీ పూజ, 108 కలశ సహిత మహాకుంభ అలంకరణ, దక్షిణకాళీ మహాహోమం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ దాత, కుంభాభిషేక నిర్వహణ కర్తలు గోపీనాథ్, కీర్తిరెడ్డి దంపతులు, వేదపండితులు పద్మనాభశర్మ, ఆలయ ప్రధాన పూజారి చంద్రశేఖర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

చల్లంగా చూడమ్మా... బంగారమ్మ



కేవీబీపురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరెలో కొలువై ఉన్న బంగారమ్మ ఆలయంలో అమ్మవారిని విజయదశమి పురస్కరించుకుని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పిం చారు. మండలంలోని కళత్తూరులో కొలువై ఉన్న అంకాలమ్మ పరమే శ్వరి ఆలయంలో విజయదశమి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు.

ఘనంగా శుక్రవార ఉత్సవం



శ్రీకాళహస్తి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షిణ చేసి తిరిగి కొలువు తీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ముక్కంటిని దర్శించుకున్న రష్యా భక్తులు



శ్రీకాళహస్తి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం రాత్రి 16 మంది రష్యా భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

కూలీలకు గిట్టుబాటు ధర

పిచ్చాటూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రతి నీటి బొట్టు ఒడిసి పట్టడంతో పాటు జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి రోజుకు రూ.307 కూలీ లభించే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సి.వి.శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ముడియూరు సచివాలయం వద్ద జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ... ప్రతి పనికి నేమ్‌బోర్డు విధిగా పెట్టించాలన్నారు. అనంతరం ఏడు రిజిస్టర్లను తనిఖీ చేశారు. సీసీ శేఖర్ రాజు, ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది, గ్రామ కార్యదర్శి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

నారాయణవనం, అక్టోబర్ 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కీళగరంలో 98 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు నారాయణవనం ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం మండల పౌర సరఫాల అధికారి ఫిర్యాదు మేరకు కీళగరం జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న పెరుమాల్ ఇంట్లో రవాణాకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 50 కిలోలు కలిగిన 98 బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. పెరుమల్‌పై కేసు నమోదు చేసిన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ సుమారు 2,20,500 ఉంటుందని తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. గురువారం తిరుపతికి చెందిన తుపాకుల రమేష్ దంపతులు రూ.25,116, శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన ఆర్.సునీల్‌కుమార్ రూ.50వేలు అందజేశారు. ఆలయ ఈవో బాపిరెడ్డి విరాళాలు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



శశి మృతదేహం

శ్రీకాళహస్తి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో శశి(23) అనే యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణ శివారు మిట్టకండ్రిగ వద్ద శుక్రవారం రాత్రి తిరుపతి-శ్రీకాళహస్తి రహదారిపై చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి మండలం పెంకలపాడుకు చెందిన గురవయ్య కలంకారీ కళాకారుడుగా జీవనం సాగిస్తుంటాడు. ఆయన కుమారుడు శశి బీటెక్ పూర్తి చేసి ప్రైవేటు కర్మాగారంలో పనిచేస్తూ తల్లిదండ్రులకు కలంకారీ వృత్తిలో సహాయంగా నిలిచేవాడు. సొంతపనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై మిట్టకండ్రిగకు శుక్రవారం సాయంత్రం వెళ్లాడు. అనంతరం తిరిగి ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో మిట్టకండ్రిగ వద్ద గూడూరుకు చెందిన ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈఘటనలో శశి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. 1టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చ్యూరీకి తరలించారు.

గందరగోళంగా గ్రామసభ

రేణిగుంట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పంచాయతీ గ్రామసభ గందరగోళంగా మారింది. శుక్రవారం మధ్యాహ్నం సర్పంచ్ నాగేశం అధ్యక్షతన పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన సభలో అభివృద్ధి పనులపై ప్రతిపక్ష నాయకులు ప్రశ్నల వర్షం కురిపించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు రూ.7లక్షలను పంచాయతీకి సంబంధం లేని డిస్ట్రిబ్యూటర్‌కు ఏలా చెల్లిస్తారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రావణ నిలదీశారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. అధికారులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపు చేశారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా 108 వాహనాన్ని మండలానికి కేటాయించకపోవడంపై వామపక్ష నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కార్యదర్శి మాధవి మాట్లాడుతూ... పంచాయతీ తీర్మానం మేరకు గతంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం సృష్టిపై శిక్షణ

రేణిగుంట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో సొంత వనరుల నుంచి ఆదాయం సృష్టిపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశపు మందిరంలో ఈవోపీఆర్డీ ప్రభురావు ఆధ్వర్యంలో పంచాయతీల్లో వనరులను ఆదా యంగా మార్చడంపై అవగాహన కల్పించారు. పలువురు పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసి స్టెంట్లు గైర్హాజరయ్యారు. చేసేది లేక వచ్చిన వారితోనే తూతూమంత్రంగా తరగతులను నిర్వహించారు.

ఇంటి స్థలాలు మంజూరు చేయండి

సత్యవేడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తమారికుప్పం గిరిజనులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్ కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ మేరకు తహసీల్దార్ రాజశేఖర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ధనుంజయశెట్టి, స్వప్న, పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

8న ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీని ఈనెల 8వ తేదీ బుధవారం లెక్కించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఉదయం 7గంటలకు ఆలయ ఆవరణంలోని కొట్టు మండపంలోఈ హుండీ లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలన్నారు.

భారీ చోరీ

- 15 సవర్ల బంగారం, 10 కిలోల వెండి అపహరణ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

సత్యవేడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసి ఉన్న రెండు ఇళ్లల్లో చొరబడి బంగారు, వెండి నగలు, నగదు అపహరించుకెళ్లారు. పట్టణంలోని పల్లపు వీధిలో నివసిస్తున్న కృష్ణమూర్తి నాలుగు నెలల క్రితం అమెరికాలోని తన కుమారుడి వద్దకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరన్న విషయాన్ని పసిగట్టిన గుర్తు తెలియని దుండగులు గురువారం రాత్రి తాళాలు పగులకొట్టి లోనికి ప్రవేశించి బీరువాలలో భద్రపరచి ఉన్న 15 సవర్ల బంగారు నగలు, సుమారు 10 కిలోల వెండి వస్తువులతో పాటు రూ.60 వేలను అపహరించుకుని వెళ్లారు. ఉదయం ఇంటి తాళాలు పగుల కొట్టి, తలుపులు తెరచి ఉండడంతో గమనించిన కృష్ణమూర్తి బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రామస్వామి సంఘటనా స్థలాన్ని పరిశీలించి, క్లూస్ టీంకు సమాచారం అందించారు. చిత్తూరు నుంచి వచ్చిన క్లూస్ టీం ఇంటిని పరిశీలించి వివరాలు నమోదు చేసుకునింది. కాగా ఒంటి గంట సమయంలో ఎవరో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఇంట్లోకి ప్రవేశించి, తెల్లవారు జామున మూడు గంటల సమయంలో వెలుపలికి వచ్చినట్లు పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీల ద్వారా తెలుస్తోంది. చోరీకి పాల్పడ్డ వ్యక్తులు బజారు వీధిలోకి ప్రవేశించి అక్కడ నుంచి డిపో రోడ్ మీదుగా జారుకున్నారు. అదే విధంగా కోమటిగుంట సమీపంలోని హరికృష్ణ ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి బీరువా పగులకొట్టి అందులో దాచిఉంచిన మూడు సవర్ల బంగారం చోరీ చేశారు. హరికృష్ణ కుటుంబంతో ఊరెళ్లడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు



రాజరాజేశ్వరిదేవిగా పొన్నాలమ్మ



ప్రత్యేక అలంకరణలో నల్లగంగమ్మ




సౌందర్యలహరి దేవిగా బహదూరుపేట కన్యకాపరమేశ్వరి



కనకాచలం కనకదుర్గమ్మకు ప్రత్యేక అలంకారం



ఆలయంలోని కనకదుర్గకు పూల అలంకారం



రాజరాజేశ్వరిగా చిన్నగంగమ్మ

శ్రీకాళహస్తి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కరుణించు మాతా అంటూ భక్తులు అమ్మవార్లకు మొక్కారు. దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం విజయదశమిని పురస్కరించుకుని అమ్మవార్లను భక్తులు భక్తిశ్రద్ధలతో కొలిచారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో కనకదుర్గమ్మ పూల అలంకరణలో భక్తులను కటాక్షించారు. ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. వేడాంలో దక్షిణ కాళికాదేవి ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో మూలమూర్తి ప్రత్యేక అలంకారంలో, ఉత్సవమూర్తి నిత్యసుమంగళి అలంకారంలో దర్శనిమచ్చారు. పానగల్‌లో కొలువై ఉన్న గంగమ్మ ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. భాస్కరపేట చాముండేశ్వరి, నల్లగంగమ్మ, ముత్యాలమ్మ, పొన్నాలమ్మ, బీపీ అగ్రహారం చిన్నగంగమ్మ, పెద్దగంగమ్మ, రాజరాజేశ్వరిదేవి, కరుమారియమ్మ, విశ్వబ్రాహ్మణవీధిలోని గంగమ్మ, నింబజాదేవి, అష్టలక్ష్మి, పూసలవీధి గంగమ్మ, శీతాలాంబ, త్రిశూలాంబ, సంతమైదానం అంకాళమ్మ, పీవీ రోడ్డులోని అంకమ్మ అమ్మవార్లు విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బహదూరుపేటలోని కన్యకాపరమేశ్వరి సౌందర్య లహరిగా భక్తులను కటాక్షించారు.

జీఎస్టీపై అవగాహన



కరపత్రాల ఆవిష్కరణలో టీడీపీ నాయకులు

ఏర్పేడు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ రేట్లపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి అన్నారు. ఏర్పేడు పట్టణంలో టీడీపీ నాయకులతో కలిసి ఆయన శుక్రవారం పలు దుకాణాల యజమానులకు జీఎస్టీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు మండల టీడీపీ అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు, నాయకులు కృష్ణవేణి, గుణయాదవ్, సుబ్రహ్మణ్యం, మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ, (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపును సద్వినియోగం చేసుకోవాలని ఏవో షణ్ముగం తెలిపారు. మండలంలోని కాటూరులో శుక్రవారం జీఎస్టీ తగ్గింపుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో నిత్యావసర సరుకులు, ఆహార ధాన్యాలు, వ్యవసాయ పరికరాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రవి, ఏఈవో రేవతి పాల్గొన్నారు.

గాంధీ జయంతి వేడుకలు



గాంధీజీకి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం మహాత్మాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, ప్రధాన కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో గాంధీజీకి నివాళులర్పించారు. మహాత్ముడు కలలు కన్న స్వరాజ్యాన్ని స్థాపించే దిశగా ప్రతిఒక్కరూ కంకణ బద్ధులై ముందుకు సాగాలన్నారు. గుర్రప్పశెట్టి, జి.గోపి, పి.శ్రీనివాసులురెడ్డి, కొండా సతీష్, మునిరాజాయాదవ్, కరీం, ఎంఎస్‌రెడ్డి, మీర్జా, దారా తదితరులు పాల్గొన్నారు.

బాబా పుణ్యతిథి

శ్రీకాళహస్తి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెన్నై రోడ్డులో కొలువై ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో బాబా 108 పుణ్యతిథిని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. స్వామివారిని పట్టణంలో ఊరేగించారు

సమస్యలను పరిష్కరించండి

ఏర్పేడు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి కోరారు. మండలంలోని బండారుపల్లిలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. వీఆర్వో మణి, పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడి అహింసా మార్గంలో నడుద్దాం

పిచ్చాటూరు, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మాగాంధీ చూపిన అహింసా మార్గంలో నడుద్దామని ఎమ్మెల్యే ఆదిమూలం పిలుపునిచ్చారు. గురువారం పిచ్చాటూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్ముడికి నివాళి అర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. అహింస అనే ఆయుధంతో దేశానికి స్వాతంత్రం తెచ్చిన మహనీయుడని కొనియాడారు. అలాగే మాజీ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కామరాజ్ నాడార్ జయంతి సందర్భంగా వారికీ నివాళులర్పించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, రవిరెడ్డి, వాసురెడ్డి, రాజేంద్రన్, మురళి, ఎస్.ఎం.సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): స్థానిక సచివాలయంలో మహాత్మగాంధీ జయంతిని సర్పంచ్ వెంకటమ్మ, ఉప సర్పంచ్ మునిరాజా, గ్రామ కార్యదర్శి పెంచలయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు.

కూటమి ప్రభుత్వంలో విద్యకు పెద్దపీట

నారాయణవనం, అక్టోబర్ 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాల విద్యకు పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. శుక్రవారం నారాయణవనంలోని జడ్పీ హైస్కూల్ ప్లస్‌లో మూడు ల్యాబ్ గదులకు రూ.68.30 లక్షలతో నిర్మించనున్న భవనానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఫిజిక్స్ కెమిస్ట్రీ ల్యాబ్‌లను నిర్మించనున్నట్లు తెలిపారు. జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్ కుమార్, నెడ్‌క్యాప్ మాజీ చైర్మన్ ఆర్డీ ఏకాంబరం, మాజీ ఎంపీపీ గోవిందస్వామి, అధికారులు ప్రజా ప్రతినిధులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. కాగా జీడీ నెల్లూరు నియోజకవర్గంలోని దేవళంపేటలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాన్ని కాల్చిన వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదిమూలం డిమాండ్ చేశారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే ఆదిమూలం



సత్యవేడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రెండో సారి జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ సుబ్బరాయుడిని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదిమూలం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన సత్యవేడులో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఎస్పీని కోరారు.

శ్రీసిటీలో జీఎస్టీ సేవింగ్స్‌పై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

సత్యవేడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌లో కలిగే ప్రయోజనాలను ప్రజలకు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, కళాకారులు, వ్యాపారుకు వివరించేందుకు శ్రీసిటీలో శుక్రవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీసిటీకి చెందిన వివిధ పరిశ్రమల ప్రతినిధులు, కమ్యూనిటీ సభ్యులు పాల్గొన్నారు. పరిశ్రమల శాఖ సంయుక్త డైరెక్టర్ జి.చంద్రశేఖర్ స్వాగతం పలికి, సమావేశం ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్లు టి.సుబ్బారావు, బి.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భారత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి ఒకరి మృతి

సత్యవేడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): బావిలో పడి ఒకరు మృతి చెందారు. సత్యవేడు ఎస్‌ఐ రామస్వామి తెలిపిన వివరాలు... పట్టణంలోని భారత్‌గ్యాస్ గోడౌన్ సమీపంలోని ఓ బావిలో గుర్తు తెలియని మృతదేహం తేలుతున్నట్లు సమాచారం అందింది. సిబ్బందితో బావి వద్దకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి విచారణ జరిపారు. మృతుడిని పట్టణంలోని బలిజవీధికి చెందిన చెంచు రామయ్య(45)గా గుర్తించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నేడు ఆటోడ్రైవర్ల సేవా ర్యాలీ

శ్రీకాళహస్తి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆటోడ్రైవర్ల సేవా పథకం కింద అర్హులైన ఆటోడ్రైవర్లకు రూ.15వేలు అందిస్తున్న నేపథ్యంలో శనివారం ఉదయం 9 గంటలకు శ్రీకాళహస్తి మండలం ఊరందూరు నుంచి మార్కెట్‌యార్డు వరకు ర్యాలీ జరగనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం తెలిపింది. ఎమ్మెల్యే సుధీర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొంది. అలాగే శనివారం ఉదయం 10గంటలకు పానగల్ కూడలి వద్ద ఏపీసీడ్స్ ప్రాంగణంలో ఎమ్మెల్యే సుధీర్ ర్యాలీ ప్రారంభించనున్నారు.

ఘనంగా అంజూరు శ్రీనివాసులు జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు జన్మ దిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వ హించారు. పట్టణంలోని వైఎస్ విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధు హాజరయ్యారు. అనంతరం అన్నదానం చేశారు. ఇక అంజూరు శ్రీనివాసులు కార్యాలయం వద్ద ఆయన్ను పలువురు ఘనంగా సత్కరించారు. సురేష్, శరవణకుమార్, ఉన్నం వాసుదేవ నాయుడు, నిర్మల, యశ్వంత్‌రెడ్డి, చంద్రయ్య నాయుడు, వి.కృష్ణారెడ్డి, పగడాల రాజు, కంఠా ఉదయ్ కుమార్, పఠాన్‌ఫరీద్, గోరా, జయశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుధ పూజ



పిచ్చాటూరు, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం విజయదశమి, గాంధీ జయంతిని పురస్కరించుకుని సర్పంచ్ రోసిరెడ్డి పారిశుధ్య కార్మికులతో కలసి పంచాయతీ కార్యాలయంలో ఆయుధ పూజ, గాంధీ జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులను శాలువలతో సన్మానించారు.

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవిటి